పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించిన అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్‌–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణలో భాగంగా శనివారం మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో కూకట్‌పల్లి, మేడ్చల్, దూలపల్లి తదితర ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించటంతోపాటు పలు సూచనలు చేశారు.

విజేతలకు అభినందనలు



ఘట్‌కేసర్: 53వ ఇంటర్ డిస్ట్రిక్ట్ లెవల్ హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్‌–2024లో అంకుషాపూర్‌లోని సాంఘిక సంక్షేమ ఇబ్రహీంపట్నం గురుకుల మహిళా కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థిని జ్యోతి విజేతగా నిలవగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అపర్ణ, అనుష టోర్నీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాధిక టోర్నీ విజేతను, టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులను శనివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రూప్‌-1 అభ్యర్థులకు వసతి ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఏడు రోజుల పాటు రోజు రెండు పూటల పరీక్షలు రాయనున్న గ్రూప్‌–1 అభ్యర్థులకు వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వసతి సౌకర్యం ఏర్పాటు చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి ప్రారంభంకానున్న గ్రూప్‌–1 పరీక్షకు హాజరుకానున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 9849441789, 9652577525 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత



నియామక పత్రం అందుకుంటున్న నాగాయపల్లి శ్రీనివాస్

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులుగా ఆర్‌జీకే కాలనీకి చెందిన నాగయపల్లి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సీమశ్రీనివాస్ ఆదేశానుసారం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి నాగయపల్లి శ్రీనివాస్ (టిఆర్ఎస్‌శ్రీను)కు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగారం అధ్యక్షులు నవీన్‌చారి, ఉద్యమకారులు బోడ జంగయ్య, బోడ నరేష్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: యువత తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని మేడ్చల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాల ఓరియంటేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తేనే ప్రమాదాలు నివారించగలమన్నారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ట్స్, క్రాఫ్ట్స్‌పై శిక్షణ తరగతులు



బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌పై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శించగా.. వారిని పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆర్ట్స్, క్రాఫ్ట్‌లో ప్రావీణ్యత సాధించాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు రాము, నళిని, హేమ, నవనీత పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఉప్పల్: ఉప్పల్ మండల పరిధిలో పదవీవిరమణ చేయబోతున్న ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి రామారావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సన్మానసభ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. మట్టి ముద్దలాగా ఉన్న చిన్నారులను మహనీయులుగా తీర్చిదిద్దగలిగేది కేవలం ఉపాధ్యాయులు మాత్రమేనన్నారు. ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ప్రేమ్‌కుమార్, మైఖేల్‌రెడ్డి, అంజనేయులు, నీరజ, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

19,756 ఎకరాల్లో పంటలు

13,788 ఎకరాల్లో వరి, 5,968 ఎకరాల్లో ఉద్యానవన పంటలు

రైతులకు అవసరమైన విత్తనాలు 7,458 క్వింటాళ్లు, ఎరువులు 4,347 మెట్రిక్ టన్నులపై దృష్టి

16,413 రైతులకు రూ.110 కోట్ల రుణాల పంపిణీకి చర్యలు

యాసంగిలో పంట సాగుకు కార్యాచరణ ఖరారు చేసిన వ్యవసాయశాఖ



సాక్షి,సిటీబ్యూరో: యాసంగి పంట సాగుకు కార్యాచరణ ప్రణాళిక జిల్లా వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 19,756 ఎకరాల్లో వివిధ పంటల సాగు అంచనాతో ప్రతిపాదనలను రూపొందించిన వ్యవసాయశాఖ విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటోంది. యాసంగిలో ఆరుతడి పంట సాగుకు అనుగుణంగా ఉద్యానవన పంటలతోపాటు జొన్న, సజ్జ, శనగ, అపరాలను పండించుకునేలా రైతుల్లో అవగాహన కల్పిస్తోంది.

- జిల్లాలోని 10 మండలాల పరిధిలో పలు రకాల పంటలను సాగు చేస్తారు. జిల్లాలో ఘట్కేసర్, కీసర, మేడ్చల్, శామీర్‌పేట్, దుండిగల్, మేడిపల్లి మండలాల్లో 13,788 ఎకరాల్లో వరి పంటను సాగు చేయనుండగా, జొన్న, మొక్కజొన్న, శనగలు, గోధుమ ఇతర పంటలను 691 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. 5,465 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు చేసేలా ప్రతిపాదనలు చేశారు. ఇందులో 2,657 ఎకరాల్లో కూరగాయ పంటలు, 2,808 ఎకరాల్లో పండ్లు, తీగ జాతి పంటలు, పూతోటలు రైతులు సాగు చేసేలా ఉద్యానవన, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా రైతులను ప్రోత్సహిస్తోంది. ప్రతి రైతుకు 5 ఎకరాలకు మించకుండా సబ్సిడీ విత్తనాలను సకాలంలో పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో మొత్తంగా 7,458 క్వింటాళ్లకు సంబంధించి వివిధ రకాల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు. వీటిలో 4455 క్వింటాళ్ల వరి విత్తనాలు, 2,900 క్వింటాళ్ల మొక్కజొన్న, 52 క్వింటాళ్ల జొన్న విత్తనాలను 6 కేంద్రాల ద్వారా సబ్సిడీపై అందజేయడానికి కసరత్తు చేస్తోంది. వ్యవసాయానికి 24గంటల విద్యుత్తు సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంటున్నారు.

110 కోట్ల పంట రుణాలు

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో యాసంగిలో 16,413 మంది రైతులకు రూ.110 కోట్ల పంట రుణాలను వివిధ బ్యాంకుల ద్వారా రైతులకు పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

సాగు చేయని భూములకూ.. రైతు భరోసా కట్..!

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 40,960 మంది రైతులకు (పట్టాదారు పాసు పుస్తకాలు) సంబంధించి 77,984 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో ప్రతి ఏటా వానాకాలం సీజన్‌లో 35 వేల ఎకరాలు, యాసంగిలో దాదాపు 20 వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలోని వ్యవసాయ భూముల్లో 50 శాతం భూములు కూడా పంట సాగు నోచుకోవటం లేదని తెలుస్తోంది. అయితే రైతు భరోసా పథకం కింద జిల్లాలో 40,960 మంది రైతులకు సంబంధించి 77,984 ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా, వీటికన్నింటికి రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం నిధులిస్తోంది. రైతు భరోసాను పరిగణలోనికి తీసుకుంటే పడావు భూముల (పంట సాగు కాని భూముల)కు కూడా రైతు భరోసా పథకం వర్తిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయశాఖ జిల్లాలో సాగు భూమి ఎంత..? పంట సాగు చేయని పడావుగా భూములు ఎన్ని ఉన్నాయన్న విషయంపై ఆరా తీస్తోంది. దీంతో పంట సాగు లేని భూములకు రైతు భరోసా అందజేసే విషయంలో తుది నిర్ణయంపై సర్కారు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

యాసంగిలో రైతులకు అన్నీ అందుబాటులో..



"యాసంగిలో రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంట సాగుకు అనుగుణంగా అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను అందుబాటులో ఉంచాం. పలు రకాల విత్తనాలను సబ్సిడీపై అందిస్తాం. జిల్లాలో 16,413 మంది రైతులకు రూ.110 కోట్ల పంట రుణాల పంపిణీ లక్ష్యం నిర్ణయించాం.

– చంద్రకళ, మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా వ్యవసాయశాఖ అధికారి

22న ఎక్సైజ్ పీఎస్‌లో వాహనాల వేలం

పోచారం: నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 22న ఉదయం 11 గంటలకు నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలం పాట నిర్వహించనున్నట్లు సీఐ రవి తెలిపారు. మూడు హోండా యాక్టివా, ఒక స్కూటీని వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 8712658736, 9642377661 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



కీసర: టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదినం సందర్భంగా కీసర మండల పార్టీ అధ్యక్షులు కృష్ణాయాదవ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలు శనివారం వజ్రేష్‌యాదవ్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నేతలు బర్లపాటి జయరాం, తదితరులు పాల్గొన్నారు.

శబరిమల ప్రధాన పూజారి ఆశీర్వచనం

కాప్రా: కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి దేవాలయ ప్రధాన పూజారిని కాప్రా డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్‌రెడ్డి కలిశారు. శబరిమల అయ్యప్పస్వామి దర్శనం అనంతరం ప్రధాన పూజారులను కలిసి ఆశీర్వచనం పొందారు. ఈ సందర్భంగా పూజారులను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

సాక్షి,సిటీబ్యూరో: రోడ్డు ప్రమాదాలు నివారించటానికి రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి రఘునందన్‌గౌడ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ ప్రజావాణి హాలులో రోడ్డు ప్రమాదాలు–భద్రతపై డ్రైవర్లు, ఉద్యోగులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ఆయన పేర్కొన్నారు. మద్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. మూల మలుపుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, అతి వేగాన్ని అరికట్టాలన్నారు. జిల్లా ట్రాన్స్‌పోర్ట్ శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ ధీరేంద్రసామినేని, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామ్‌మోహన్, జిల్లా స్పోర్ట్స్ అధికారి గోపాల్‌రావు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై ఉద్యోగులు, డ్రైవర్‌లకు అవగాహన కల్పించటంతోపాటు శిక్షణ కూడా ఇచ్చారు.

సమస్యలపై అధికారులకు వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న లోటస్ ఎన్‌క్లేవ్ వాసులు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో అక్రమ నిర్మాణాలు, ప్రజల సౌకర్యార్థం సర్వీసు రోడ్డు ఏర్పాటు, పార్క్ స్థలం అన్యాక్రాంతం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని వివిధ కాలనీలు, లోటస్ ఎన్‌క్లేవ్ వాసులు జిల్లా కలెక్టర్‌కు, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌కు, మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రాలు అందజేసి పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. పట్టణంలోని అత్వెల్లి రాఘవేంద్రనగర్ కాలనీలో పార్క్ స్థలంను కొంతమంది ఆక్రమణలు చేసి అక్రమ నిర్మాణాలు చేశారని, రాఘవేంద్రనగర్ కాలనీలో అనుమతులు లేకుండా అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. జాతీయ రహదారి నుంచి కేఎల్ఆర్ వెంచర్ మీదుగా కిష్టాపూర్ వరకు 100 ఫీట్ల రోడ్డు ప్రతిపాదన చేశారని, వంద ఫీట్ల రోడ్డు ప్రతిపాదనలో ఉన్న బాలాజీనగర్, రాఘవేంద్రనగర్‌లో నిబంధనలు పాటించకుండా రోడ్డు వైపు నిర్మాణాలు చేస్తున్నారన్నారు. అత్వెల్లి నుంచి మేడ్చల్ వరకు సర్వీసు రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కౌన్సిలర్ దేవ, సీనియర్ నాయకుడు గోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివశంకర్, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: గౌడవెల్లి సబ్ స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని మేడ్చల్ రూరల్ మౌలాలి ఏఈ తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాసిరేగడి, జ్ఞానాపూర్, జ్ఞానాపూర్ గడ్డలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

నేడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం

కీసర: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడిగా కీసరకు చెందిన బెలిదేరమేష్‌గుప్తా ఎన్నికైయ్యారు. ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం నేడు కీసరలోని కేబీఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. పెద్ద ఎత్తున ఆర్యవైశ్య సంఘం నేతలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వికలాంగుల కాలనీలో అన్నదానం



జవహర్‌నగర్: మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శంకర్‌గౌడ్, కార్పొరేటర్ నిహారికగౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూడిద వెంకటేష్, అశోక్‌కుమార్ గుప్తా, అనిల్‌కుమార్ ముదిరాజ్, రమేష్‌చారి, శంకర్, మేరీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ఎదుట ఆందోళన



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు

మేడ్చల్‌రూరల్: అనుభవం లేని వైద్యులు ఆపరేషన్ చేసి ప్రాణం మీదకు తెచ్చారంటూ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఆసుపత్రి ముందు శనివారం బాధితులు ఆందోళన చేశారు. మేడ్చల్ పట్టణానికి చెందిన అరుణ గతేడాది ఆగస్టులో రక్తహీనత సమస్యతో ఆసుపత్రికి వెళ్లగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు మందులు ఇచ్చి ఇంటికి పంపారు. మందులు వాడినా నయం కాకపోవడంతో గత ఏప్రిల్‌లో రక్తహీనత సమస్యతో సీఎంఆర్ ఆసుపత్రిలో చేరింది. వైద్యులు పరీక్షించి సర్జరీతో నయం అవుతుందని తెలిపి గర్భసంచి తొలగించారు. కొన్ని రోజులకు మూత్ర సమస్య రావడంతో తిరిగి ఆసుపత్రిలో చేరగా మూత్రనాళానికి ఆపరేషన్ చేశారు. మరోమారు మూత్రనాళాల నుంచి రక్తస్రావం, మూత్రం నిరంతరం బయటికి వస్తుండడంతో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. దీంతో బాధిత కుటుంబీకులు ఆందోళన చేసి నగరంలోని మరో ఆసుపత్రికి తీసుకెళ్లాలని కోరగా వారు మరో ఆసుపత్రిని సంప్రదించడంతో అక్కడి వైద్యులు 2వ సారి చేసిన ఆపరేషన్ సక్సెస్ కాకపోవడంతో మూత్రనాళ సమస్య ఏర్పడిందని తెలిపారు. మరోమారు ఆపరేషన్ చేస్తే సమస్య తొలుగుతుందని వివరించారు. దీంతో అరుణ తనకు వైద్యులు సరిగ్గా ఆపరేషన్ చేయకపోవడంతో సమస్య తలెత్తిందని ఆసుపత్రికి వెళ్లి ఆందోళన చేశారు. జూనియర్ వైద్యులు, అనుభవం లేని వైద్యులు పరీక్షలు చేయడమే కారణమని ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఆసుపత్రి యాజమాన్యం తమ ఆసుపత్రిలోనే మరోమారు వైద్యం అందించి ఆపరేషన్ చేస్తామని తెలుపగా, బాధితురాలు తనకు ఆసుపత్రిపై నమ్మకం లేదని నగరంలో మేము చెప్పిన ఆసుపత్రిలోనే ఆపరేషన్ చేయించాలని, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. యాజమాన్యం వివరణ కోరగా అరుణకు మొదటి గర్భసంచి తొలగించామని తర్వాత మూత్రనాళ సమస్యకు ఆపరేషన్ చేశామని తెలిపారు. అరుణ శరీరం సహకరించకపోవడంతోనే మూత్రనాళ సమస్య పునరావృతం అయ్యిందన్నారు. తమ ఆసుపత్రిలో అనుభవం ఉన్న వైద్యులే ఉన్నారని తమ వైద్య పరీక్షల్లో లోపం లేదన్నారు.

మతోన్మాది దిష్టిబొమ్మ దహనం



ఘట్‌కేసర్: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై దాడి చేసిన ఘటనకు నిరసనగా శనివారం ఘట్‌కేసర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బస్ టర్మినల్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్, గోరక్షక్ కార్యకర్తలు చంద్రశేఖర్‌ముదిరాజ్, అరవింద్, మహేందర్, శ్రీనివాస్‌చారి, చంద్రశేఖర్‌గౌడ్, శివ, మధు, పవన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లు.. అడుగేస్తే పాట్లు

● గుంతలమయంగా మారిన రోడ్లు ● అవస్థలు పడుతున్న ప్రజలు ● మరమ్మతులు చేయని అధికార యంత్రాంగం

అయోధ్య చౌరస్తా వద్ద అధ్వానంగా రోడ్డు



మేడ్చల్‌-గండి మైసమ్మ రోడ్డు దుస్థితి







గుండ్లపోచంపల్లి నుంచి మైసమ్మగూడ వెళ్లే రోడ్డు పరిస్థితి

మేడ్చల్: మండల, మున్సిపాలిటీల పరిధిలోని రోడ్లు వర్షాలకు, భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతిని ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నా అధికార యంత్రాంగం కనీసం మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. జాతీయరహదారి నుంచి రాజీవ్‌రహదారిని కలిపే మేడ్చల్ –మజీద్‌పూర్ లింకు రోడ్డు గుంతలమయంగా మారడంతో నిత్యం వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మేడ్చల్‌–కిష్టాపూర్ వరకు, రావల్‌కోల్ నుంచి రాజబొల్లారం వరకు రోడ్డంతా గుంతలమయంగా మారింది. మేడ్చల్ నుంచి నర్సాపూర్ రోడ్డును కలిపే మేడ్చల్ గండి మైసమ్మ రోడ్డు గౌడవెల్లి చౌరస్తా వద్ద, అయోధ్య చౌరస్తా వద్ద, బాసిరేగడి వద్ద గుంతలమయంగా తయారయ్యాయి. దీంతో గుండ్లపోచంపల్లి నుంచి నూతన్‌కల్ వెళ్లే రోడ్డులో గుండ్లపోచంపల్లి నుంచి గౌడవెల్లి వరకు ప్రయాణికులు నానా అగచాట్లు పడుతూ నరకం చూస్తున్నప్పటికీ కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. మండలంలోని ప్రతీ రోడ్డు అధ్వానంగా మారి గుంతలమయమైన కనీసం ప్యాచ్‌వర్క్‌లు కూడా చేయకుండా అధికారులు పట్టించుకోవడంలేదు. నూతనంగా రోడ్లను నిర్మించకున్నా, కనీసం మరమ్మతులు చేయాలని ప్రజలు అధికారులను, పాలకులను కోరుతున్నారు.

గేదెను ఢీ కొట్టిన ద్విచక్రవాహనం.. మహిళ మృతి



మృతిచెందిన సంధ్య

శామీర్‌పేట్: గేదెను ఢీ కొట్టి మహిళ మృతి చెందగా మరో ఇద్దరు గాయాలపాలైన ఘటన జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అడ్డగుట్టలో నివాసం ఉండే సంధ్య(26), తన కుమారుడితో పాటు భర్త, మరో వ్యక్తి పల్సర్ బైక్‌పై కరీంనగర్ నుంచి నగరంలోని అడ్డగుట్టకు రాజీవ్ రహదారి గుండా వస్తున్నారు. శామీర్‌పేట్ మండల పరిధి, లాల్‌గడి మలక్‌పేట ఫారెస్ట్ సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా రోడ్డుపైకి గేదె రావడంతో అదుపుతప్పి గేదెను ఢీ కొట్టారు. దీంతో బైక్ పై ప్రయాణిస్తున్న వారు రోడ్డుపై పడిపోగా మహిళకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరికి గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు. సదరు ఘటనపై జినోమ్‌వ్యాలీ పోలీసులను సంప్రదించగా వివరాలు వెల్లడించలేదు.